క్లుప్తంగా

భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటయ్య ఆలయం



కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం మాఘమాసం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు వేకువజామునుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణం మద్దిలేటయ్య నామస్మరణలతో మారుమోగింది.

క్రీడాకారునికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : క్రీడాకారుడు నారాయణస్వామికి స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతల నుండి సేకరించిన నగదును శనివారం సీఐ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. సీఐ సైతం తనవంతుగా ఆర్థిక సాయం చేశారు. ఈ నెల హైదరాబాద్‌లో జరుగనున్న నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అండర్ 60లో హైజంప్, లాంగ్‌జంప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న నారాయణ స్వామికి స్ఫూర్తి సభ్యులు అండగా నిలిచారు. కార్యక్రమంలో స్ఫూర్తి అధ్యక్షులు సీసీంగుంతల మధు,సభ్యులు రాము,ఉప్పర్లపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ దాతలు కావాలి



రక్తదాన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కోవెలకుంట్ల: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమై ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతయ్య సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డిపోలో పనిచేస్తున్న 27 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కిషోర్ యూనియన్ నాయకులు శివరాం, గిరి, నరసింహ, ఆచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న ఆర్టీసీ సిబ్బంది

డోన్ టౌన్ : రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్టీసీ సిబ్బంది పాతబస్టాండ్‌లోని సమైఖ్యాంధ్ర కట్ట వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు రోడ్డు భద్రత నియమాలను డీఎం వివరించారు. ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఐవీఆర్ రెడ్డి, సీతరామిరెడ్డి, బాలమద్దయ్య, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు జిలానీ, శ్రీనివాసులు,సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మద్దయ్య, సిబ్బంది దినేష్‌రెడ్డి, గ్యారేజ్ సూపర్‌వైజర్లు గోపాల్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డోన్ విద్యార్థినికి క్రీడా బిందు అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థిని శ్రీనిత్య, మాస్టర్ రమణ

డోన్ టౌన్ : కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనభరచే వారికి అందించే క్రీడా బిందు అవార్డును డోన్‌కు చెందిన రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థిని శ్రీనిత్య, బెస్ట్ కోచ్‌గా రమణను వరించాయి. శనివారం కర్నూలులోని స్కంధ హిల్స్ లో జరిగిన ఏపీ రింగ్ ఫైట్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కర్నూలు మేయర్ బీవీ రామయ్య, రింగ్ ఫైట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రసిడెంట్ రవి, రాష్ట్ర అధ్యక్షుడు దేవా, కార్యదర్శి అబ్దుల్లా చేతుల మీదుగా క్రీడా బిందు అవార్డును శ్రీనిత్య రమణ అందుకున్నారు.

అమడాల.. అభివృద్ధి మిన్న!

- రూ. 1.50 కోట్లతో అభివృద్ధి పనులు
- జుర్రేరు వాగుపై కల్వర్టు ఏర్పాటుతో తీరిన ఏళ్లనాటి కల
- ఎస్సీ, బీసీ కాలనీల్లో మెరుస్తున్న సీసీ రోడ్లు



కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల



రూ. 75 లక్షలతో వాగుపై కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామం అభివృద్ధిలో మిన్నగా నిలిచింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో రూ. 1.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. తాగునీరు, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో చిన్నపాటి వర్షానికే వీధులన్నీ బురదమయం అయి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. రూ. 10 లక్షలతో సీసీరోడ్లు ఏర్పాటు చేయడంతో రోడ్లు మిలమిల మెరుస్తున్నాయి. అమడాల మెట్ట సమీపంలో బోరు ఏర్పాటు చేసి మినరల్‌వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామంతోపాటు బనగానపల్లె- కోవెలకుంట్ల ఆర్ అండ్‌బీ రహదారిలో ప్రయాణాలు సాగించే ప్రయాణికులకు దాహార్తి తీరుస్తున్నారు. బట్టలు ఉతికేందుకు దోబీఘాట్లు లేక రజకులు ఇబ్బందులు పడుతుండటంతో రూ. 10 లక్షలతో గ్రామ శివారులో బోరుతోపాటు దోబీఘాట్లు ఏర్పాటు చేశారు. నాడు- నేడు మనబడి కార్యక్రమంలో ద్వారా రూ. 10 లక్షలతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జలజీవన్ మిషన్ కింద ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 15 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.



ఏళ్లనాటి కల సాకారం:

ప్రత్యేకించి జుర్రేరు వాగుపై కల్వర్టు లేక రెండు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న కష్టాలు శాశ్వితంగా తీరిపోయాయి. కోవెలకుంట్ల మండలం అమడాల- బిజనవేముల మధ్య జుర్రేరు వాగుపై కల్వర్టు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు దాటేందుకు అష్టకష్టాలు తప్పేవి కాదు. ఏడాదిన్నర క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు వాగు కష్టాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన కాటసాని వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ. 55 లక్షలు నిధులు మంజూరు చేయించారు. కల్వర్టుతోపాటు ఈ రహదారిలో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి గడప గడపకు మన ప్రభుత్వం, మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలు నిధులు కేటాయించారు. ఈ మేరకు కల్వర్టు, సీసీరోడ్డు నిర్మించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అమడాలలో జరిగిన అభివృద్ధి వివరాలు...

- రూ. 75 లక్షలతో జుర్రేరువాగుపై కల్వర్టు నిర్మాణం
- రూ. 25 లక్షలతో శివాలయం నుంచి జుర్రేరు వాగు వంతెన వరకు సీసీరోడ్లు
- రూ.10 లక్షలతో రజకులకు దోబీఘాట్లు ఏర్పాట్లు
- రూ. 10 లక్షలతో బీసీ, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు
- రూ. 10 లక్షలతో నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల మరమ్మతులు
- రూ. 1.30 లక్షలతో అమడాల మెట్ట వద్ద మినరల్ వాటర్ ప్లాంట్‌కు బోరు
- రూ.75 వేలతో ఎస్సీ కాలనీలో కల్వర్టు నిర్మాణం
- రూ. లక్షతో గ్రామంలోని చేతిబోర్లకు మరమ్మతు పనులు





కాలనీల్లో మెరుస్తున్న సీసీరోడ్లు

అన్ని వసతులు కల్పించాం



గ్రామంలోని ఆయా కాలనీల ప్రజలకు అన్ని వసతులు కల్పించాం. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి చేయగలిగాం. ఎన్నో ఏళ్ల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాం. త్వరలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, పొలాలకు వెళ్లే రస్తాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేసిన ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు.

– బాలమద్దిలేటి, సర్పంచ్, అమడాల

సీసీ రోడ్లతో తొలగిన కష్టాలు



ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీరోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు అవస్థలు ఎదుర్కొవాల్సి వచ్చేది. సీసీ రోడ్లు ఏర్పాటు చేయడంతో కష్టాలు తీరిపోయాయి. మౌలిక సదుపాయాల అవసరాలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేశాం. రాబోయే రోజుల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం.

– శంకరయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, అమడాల

సర్కారుబడి రూపురేఖలు మారిపోయాయి



గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గతంలో పలు సమస్యలుఉండేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. రూ. 10 లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా పాఠశాలను తీర్చిదిద్ది పేద పిల్లల చదువుకు భరోసా కల్పించింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– సుధాకర్‌రెడ్డి, అమడాల

ప్రజారోగ్యానికి పెద్దపీట



బేతంచెర్ల పట్టణంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలోఎంపీపీ,వైఎస్సార్‌సీపీనాయకులు

బేతంచెర్ల: ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వార మెరుగైన వైద్య సేవలు అందజేస్తుందని ఎంపీపీ బుగ్గన నాగభూషనం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్ అన్నారు. శనివారం పట్టణంలోని 5వ వార్డు, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపాన రూ.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ షేక్ ముబీనా, కోట్ల మధు ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. అదేవిధంగా రూ.1.60 కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, కల్వర్టులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజ, నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, దస్తగిరి, నాగరాజు, బుగ్గన భాస్కర్ రెడ్డి,వెంకటేశ్వర్‌రెడ్డి, నిరంజన్, వలీ బాషా, మల్లికార్జున, డక్కి శేఖర్, ఖాజా, చంద్రశేఖరయ్య, ఖాజా పాల్గొన్నారు.

గోర్లగుట్టలో అభివృద్ధి పనుల ప్రారంభం

మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ ప్రారంభించారు. రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలతో ఆర్బీకేతో పాటు సుమారు రూ.70 లక్షలతో పూర్తయిన బనగానపల్లె ప్రధాన రహదారి బ్రిడ్జిని సర్పంచ్ బూషి మాదక్క, ఉప సర్పంచ్ సుధాకరప్ప, ఏఓ కిరణ్ కుమార్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకిరెడ్డి, చలపతిరెడ్డి, హేమనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం కింద రీ సర్వే చేసిన భూముల రైతులకు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి, తెలుగు మద్దయ్య, అరి గెల శేఖర్, బాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి మహాకుంభాభిషేకం ఉత్సవాలు ప్రారంభం



కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, కోడలు

బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం మహాకుంభాబిషేకం పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధాశ్రీరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మహోత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు వీరికి ఈఓ రామానుజన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ చౌడేశ్వరి మాత ఆలయంలో మూలవిగ్రహానికి మార్పులు చేర్పులు చేసి చేపట్టిన ప్రాణప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 14న పూర్ణహుతి, మహాకుంభాబిషేక కళాకర్షణం, అన్నప్రసాద వితరణ, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామ పెద్దలు ఆలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీఆర్ మురళీమోహన్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ సంప్రోక్షణ

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు శనివారం నుంచి భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపడింతుల గోపూజ, గణపతి పూజ, పుణాహవచనం, ఆచార్యాది ఋత్వీకరణం కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి గణపతిహోమం, దీక్షాహోమం, కలశ జలాధివాసం, రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి. 12న ఉదయం కలశప్రతిష్ఠ, ఆలయ సంప్రోక్షణ, దీక్షా హోమం, పుణ్యాహుతి కార్యక్రమాలతో ఆలయ సంప్రోక్షణ కార్యక్రమం ముగుస్తోందని అర్చకులు తెలిపారు.

దొరపల్లెలో గావ్ చలో అభియాన్

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని దొరపల్లె గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరిస్తూ క్యాలెండర్లు, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రనాయుడు, దేవేంద్ర, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కొలిమిగుండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఈనెల 12న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించనున్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలో అస్తవ్యస్థంగా ఉన్న ప్రధాన సీసీ రోడ్డు రూపురేఖలే మార్చేశారు. రూ.కోటితో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నుంచి తేరుమిద్దె వరకు విశాలమైన సీసీ రోడ్డు నిర్మించారు. రామ్‌కో సిమెంట్ కంపెనీ సహకారంతో రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. మీర్జాపురంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు, 24 గంటల విద్యుత్ సరఫరా కల్పించారు. గొర్విమానుపల్లెలో రూ.40 లక్షలతో ప్రధాన రహదారితో పాటు శివాలయంకు చేరుకునే దారిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. వీటి పైపనులన్నీ ప్రారంభించేందుకు ముస్తాబు చేశారు.



కొలిమిగుండ్లలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, పెట్టుబడి సాయం నుంచి పంట దిగుబడులు అమ్ముకునేంత వరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నదాతకు అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండలంలోని చెరువుపల్లె గ్రామంలో అక్కజమ్మ చెరువుకు ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వ నుంచి రూ.2.28 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ స్థాయిలోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తనం ఎంపిక నుంచి ఎరువులతో పాటు గిట్టుబాటు ధర కూడ కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500 రైతు బ్యాంకు ఖాతాలోనే జమ చేయడం జరుగు తుందన్నారు. అతివృష్టి,అనావృష్టి కారణాలతో పంట నష్టం జరిగితే ఏ సీజన్‌కు సంబంధించి బీమా మొత్తం ఆ సీజన్‌లోనే రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. చెరువుపల్లెలోని ఎత్తిపోతల పథకం ఈ ప్రాంత రైతులకు వరంలాటిందని, 126 ఎకరాల ఆయకట్టుకు సాగునీరుతో పాటు గ్రామంలో భూగర్భ జలాలు కూడా పెరగుతాయన్నారు. ఈ చెరువును లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 25 హెచ్‌పీ కెపాసిటీ కలిగిన మూడు మోటార్లు పని చేయడం జరుగుతుందని, రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకొని పంటలు పండించుకోవాలని సూచించారు. వ్యవసాయం దండగ అన్న సీఎం చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తుండడంతో మభ్యపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలువాలని, మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కాటసాని ప్రజలను కోరారు. అనంతరం ఎమ్మెల్యేను రామిరెడ్డిని గ్రామ రైతులు వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఏఈ నారాయణరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, నాగయ్య, భూపాల్, గడ్డం బాషా, సూర్యనారాయణ రెడ్డి, రామసుబ్బయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణం నుంచి బేతంచెర్ల వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనుల కారణంగా 33 కేవీ లైన్ షిఫ్టింగ్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్న మల్కాపురం, బేతంచెర్ల మండలంలోని రంగాపురం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గ్రామాలకు, ఫ్యాక్టరీలకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఉంటుందని ఆయన వివరించారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

డోన్ టౌన్ : దేశ వ్యాప్తంగా ఈ నెల 16న చేపట్టనున్న సమ్మెను రవాణ రంగం కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యులు శివరామ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆటో, లారీ యూనియన్ జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రవాణ రంగం పెరిగిన పెట్రోలు, డీజిల్, పరికరాల ధరలతో అతాలకుతం అయ్యిందన్నారు. సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, కార్యదర్శి లక్ష్మణ్, సీఐటీయూ జిల్లా అధక్షుడు ఏసురత్నం, నాయకులు వెంకటలింగం, కరీంముల్లా, ఖాజా, శ్రీను, రమేష్, సురేంద్ర పాల్గొన్నారు.

పెట్నికోట రోడ్డుకు మోక్షం!

- రూ. 5.10 కోట్లు మంజూరు
- రహదారిని పరిశీలించిన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



రోడ్డును పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు ఉన్నా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఎవరికి రాలేదు. అయితే జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పెట్నికోట నుంచి అంకిరెడ్డిపల్లె సమీపంలోని ప్రధాన రహదారి వరకు ఉన్న రోడ్డును ఆధునీకరించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం పీఆర్ డీఈ నాగ శ్రీనివాసులతో కలిసి ఆ రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతు పెట్నికోట- అంకిరెడ్డిపల్లె సమీపంలోని ప్రధాన రహదారి వరకు 5.8 కి.మీ దూరం ఉందన్నారు. రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.5.10 కోట్లు మంజూరు చేయగా ఇటీవలనే టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. రోడ్డు అధ్వాన్నస్థితికి చేరుకోవడంతో రాక పోకలు సైతం నిలిచిపోయాయని, ప్రజల సౌకర్యార్థం రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. పెట్నికోట, నాయినపల్లె, కొండమీదపల్లె, అవుకు మండలం జూనూతల, కొండమనాయినపల్లె, ఉప్పలపాడు తదితర గ్రామాల ప్రజలు తాడిపత్రికి వెళ్లాలంటే తుమ్మలపెంట,గొర్విమానుపల్లె మీదుగా తాడిపత్రికి చేరుకోవాల్సి ఉండేదన్నారు. పెట్నికోట రోడ్డు ఏర్పాటు అయితే 6కి.మీ దూరం తగ్గుతుందన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కొలిమిగుండ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి కొలిమిగుండ్లలో స్కిల్‌సెంటర్ కోసం భవనాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న భవనం అన్ని విధాలా అనుకూలంగా ఉందని గుర్తించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నందున స్కిల్‌డెవలప్‌మెంట్‌పై శిక్షణ యువతకు ఉపయోగపడుతుందని, జెడ్పీ చైర్మన్ సూచన మేరకు ఇక్కడ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళలకు కుట్లు, అల్లికలు తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఐటీఐ చేసిన విద్యార్థులు చాలా మంది ఉన్నా ఫ్యాక్టరీల్లో పని చేసేందుకు అవసరమైన స్కిల్స్ లేనందున ఉద్యోగం పొందలేకపోతున్నారన్నారు. స్కిల్ డెవలప్ సెంటర్‌లో శిక్షణ పొందిన యువతను పరిశ్రమల్లో ఉద్యోగాల్లోకి తీసుకునే అవకాశాలు ఉంటాయని చెప్పారు. అన్నీ అనుకూలిస్తే ఈనెలాఖరుకు సెంటర్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నందిపాడు, నాగిశెట్టిపల్లె సర్పంచ్‌లు గుర్విరెడ్డి, ఈశ్వరయ్య, నాయకులు కామిని తిమ్మారెడ్డి, రామసుబ్బయ్య, నాగేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈ నెల 12 నుంచి బనగానపల్లె నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తారని, అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. 12వ తేదీ ఉదయం ఎమ్మెల్యే కాటసాని బనగానపల్లెలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహావిష్కరణ చేస్తారన్నారు. అదేవిధంగా అవుకు మండలం, చెర్లోపల్లిలో సీసీ రోడ్డు, మండల కేంద్రం కొలిమిగుండ్ల, గొర్విమానుపల్లి, మీర్జాపురం గ్రామాల్లోనూ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. 13న కోవెలకుంట్ల కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. 14న బనగానపల్లె అవుకు మెట్ట వద్ద బీటీ రోడ్డు, కోవెలకుంట్ల పట్టణంలో సెంట్రల్ లైటింగ్, కాంపౌండవాల్, సీసీ రోడ్లు ప్రారంభోత్సవాలు, 15న కోవెలకుంట్ల పట్టణంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. 16న యాగంటి క్షేత్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, 17న బనగానపల్లెలో ముస్లిం శ్మశానవాటి కంపౌడ్‌వాల్ ప్రారంభోత్సవం, 19వ తేదీన పలుకూరు గ్రామంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయా కార్యక్రమాలకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.